క్లుప్తంగా

ఘనంగా వన భోజన మహోత్సవం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

జి.మాడుగుల: స్నేహ బాంధవ్యాలకు వనభోజన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని గురుకులం ప్రిన్సిపాల్ వై.పారయ్య చెప్పారు. మండల కేంద్రంలో గల గురుకులం కళాశాలలో మంగళవారం ఘనంగా వన భోజన వేడుక ఉత్సాహంగా జరిగింది. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కళాశాలలో సందడి నెలకొంది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని, తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని సూచించారు. అధ్యాపకులు, పలు ప్రాంతాలకు చెందిన పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య పడాల్

చింతపల్లి: మండల కేంద్రంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసి సభ్యుడు పోతురాజు బాలయ్య పడాల్ ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ శుభం కలగాలని ఆకాంక్షించారు. వైస్ ఎంపీపీ గోపినాయక్ శారద, సర్పంచ్ దురియా పుష్పలత, గొందిపాకలు, పెదబరడ, చౌడుపల్లి, ఎర్రబొమ్మలు, ఎంపీటీసీ సభ్యులు మోహన్‌రావు, లోవరాజు,మీనాకుమారి,సెగ్గె సత్తిబాబు, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి, పలు సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


అంత్యక్రియలకు ఆర్థిక సాయం



బాలుడి కుటుంబానికి నగదు అందజేస్తున్న సీఐ కన్నపరాజు

ఎటపాక: మండలంలో దారుణ హత్యకు గురైన బాలుడు కణితి నాగరాజు కుటుంబానికి పోలీస్ శాఖ ఆర్థిక సాయం అందించింది. మద్దిగూడెం గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడు సోమవారం హత్యకు గురయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం ఉదయం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలుడి అంత్యక్రియలకు ఎటపాక సీఐ కన్నపరాజు రూ.10వేల నగదును తల్లిదండ్రులు వెంకటేష్, రమ్యలకు అందించారు.

ప్రజా సమస్యలపై పోరాటం



నినాదాలు చేస్తున్న సీపీఐ నేతలు

కొయ్యూరు: మండల కేంద్రం రాజేంద్రపాలెంలో సీపీఐ వందో ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ మండల కార్యదర్శి ఇరువాడ దేముడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వియ్యపు నానాజీ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తూ ఉందన్నారు.మండల సహాయ కార్యదర్శులు కస్తూరి రమేష్, బుల్లి విజయకుమార్‌లు, ఏఐటీయుసి మండల కార్యదర్శి డి.కనకరాజు, మాజీ ఎంపీటీసీ బి.శివరామరాజు, గోకిరి చిన్నారావు,బొమ్మ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

రాజవొమ్మంగి: మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వరరావు మంగళవారం పర్యవేక్షించారు. లబ్ధిదారులకు నగదు అందజేశారు. మండలంలోని 85 శాతం పంపిణీ జరిగిందని, మిగిలిన పింఛన్ల త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.



అరకులోయలోని స్వీట్ షాపు వద్ద కొనుగోలుదారులు

కొంగొత్త ఆశలతో..

స్వీట్లు, గిఫ్ట్ షాపుల వద్ద సందడి

నూతన సంవత్సరం రోజు నూతన వస్త్రాలు ధరించి, స్నేహితులకు గిఫ్ట్‌లు,. పూల బొకేలు, స్వీట్స్, పండ్లు ఇవ్వడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అరకులోయలోని స్వీట్ స్టాల్స్, పూల దుకాణాలు, గిఫ్ట్ షాపుల్లో వ్యాపారాలు జోరుగా సాగాయి. స్థానికులు, పర్యాటకులు అధిక సంఖ్యలో కేక్‌లు, బొకేలు కొనుగోలు చేయడంతో వాటికి డిమాండ్ ఏర్పడింది.

నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని యువతీ యువకులు కేరింతలు కొట్టారు. పాత సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ.. నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఎంజాయ్ చేశారు. వాడవాడలా హ్యాపీ న్యూ ఇయర్ సందడి నెలకొంది. మహిళలు ఇళ్ల ముందు పాత సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ.. హ్యాపీ న్యూ ఇయర్–2025కి స్వాగతం పలుకుతూ వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. రంగు రంగుల ముగ్గులు వేసి.. వాటిపై చెమ్కీలు అద్ది అందంగా అలంకరించారు. దేవాలయాలు,చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. కొత్త సంవత్సరంలో తమ ఆశలు ఫలించాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు.

- వాడవాడలా న్యూఇయర్ వేడకలు
- రిసార్ట్సలు, హోటళ్లలో సందడి
- కళకళలాడిన మార్కెట్‌లు
- కేక్‌లు, స్వీట్‌లకు డిమాండ్
- యువత, చిన్నారుల సందడి



రాజవొమ్మంగిలో ఇంటి ముంగిట న్యూయిర్ శుభాకాంక్షలు తెలుపుతూ రంగవల్లులు అద్దుతున్న మహిళ



విద్యుత్‌దీపాలంకరణలో గిరిజన మ్యూజియం

అరకులోయటౌన్: న్యూ ఇయర్ హంగామా అంబరాన్ని అంటింది. రాత్రి 9 గంటల నుంచే సందడి నెలకొంది. రోడ్లపై యువకులు కేరింతలు కొడుతూ ఎంజాయ్ చేశారు. చిన్నారులు ఇళ్లల్లో సందడి చేశారు. సరిగ్గా 12 గంటలకు న్యూఇయర్‌ను ఆహ్వానిస్తూ పెద్ద ఎత్తున కేరింతలు కొడుతూ యువత, చిన్నారులు సందడి చేశారు. ప్రతి ఒక్కరికి న్యూ ఇయర్ విషెస్ చెబుతూ ఆప్యాయత.. అనురాగాలు పంచుకున్నారు.

మార్కెట్‌కు న్యూఇయర్ శోభ

అరకులోయ మార్కెట్‌లో కొత్త సంవత్సర శోభ నెలకొంది. పల్లె, పట్నం అనే తేడా లేకుండా మంగళవారం రాత్రి 12 గంటల తరువాత పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ యువతీ యువకులు, కేక్ కట్ చేసి సందడి చేశారు.

రిసార్ట్స, హోటళ్లలో ముందుస్తు బుకింగ్‌లు

అరకు పర్యాటక కేంద్రంలోని ఏపీ టూరిజం జంగిల్ బెల్స్, అనంతగిరి, అరకులోయలోని పున్నమి వ్యాలీ రిసార్ట్స్, మయూరి హిల్ రిసార్ట్స్‌తో పాటు ప్రయివేటు లాడ్జీలు, రిసార్ట్సలు ముందుస్తు బుకింగ్‌లు చేసుకున్నారు. క్యాంప్ ఫైర్స్‌తో ఏర్పాటు చేసి హుషారుగా గడిపారు. న్యూ ఇయర్ సందర్భంగా ఇక్కడా వ్యాపారాలు జోరుగా సాగాయి. దీంతో వ్యాపారులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాల వద్ద మందుబాబుల హడావుడి కనిపించింది. డిసెంబర్ 31వ తేది రాత్రి మద్యం విక్రయాలు గణనీయంగా పెరిగాయి. వైన్ షాపుల నిర్వాహకులు ముందస్తుగా స్టాక్ సిద్ధం చేసి విక్రయాలు సాగించారు.

రాజవొమ్మంగి: మండలంలో న్యూ ఇయర్ సంబరాలు మిన్నంటాయి. అర్ధరాత్రి 12 గంటలు దాటినా కుల, మతాలకు అతీతంగా, ఇంట బయట, ఊరు వాడ న్యూ ఇయర్ సంబరాలు జరుపుకొన్నారు. ఇంటి ముంగిట రంగవల్లులు అద్దుతూ ఆంగ్ల నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. స్నేహితులతో సరదాగా సంతోషంగా గడిపారు. ఒకొరికొకరు న్యూయిర్ విషెస్ తెలుపుకున్నారు.

ఉద్యోగ సాధనే లక్ష్యం



నేను బిఎస్సీ అగ్రికల్చర్ చదివాను. 2025వ సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తానని దృఢసంకల్పంతో ఉన్నాను. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తే జాబ్ సాధించేందుకు నా శాయశక్తులు ప్రయత్నిస్తా.

– శెట్టి మనోజ్ కుమార్, నిరుద్యోగి, బిసీస్సీ అగ్రికల్చర్, అరకులోయ

టీచర్ కావడమే ఆశయం



నేను బిఎస్సీ మ్యాథ్స్ డైట్ పూర్తి చేశారు. ఈ కొత్త ఏడాదిలో ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా పోస్టులు భర్తీ చేస్తే టీచర్ ఉద్యోగం సాధించాలనేది నా ఆశయం. ఏజెన్సీలో విద్యాభివృద్ధే నా లక్ష్యం. నమ్మకం నాకు ఉంది. అందుకు తగ్గట్టు కష్టపడి చదువుతున్నాను. కోచింగ్ కూడా తీసుకున్నాను.

– బారికి కళ్యాణ్, బోసుబెడ గ్రామం, అరకులోయ మండలం

అందరూ బాగుండాలి.. అందులో మనముండాలి



అనేక విపత్తుల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. ఈ కొత్త సంవత్సరంలో అయినా అందరూ సుఖ సంతోషాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. మనతో పాటు అందరూ బాగుండాలని కోరుకుందాం.

– శ్రీలేఖ, ముంచంగిపుట్టు

ప్రతి కుటుంబంలో సంతోషం నిండాలి



2025లో ప్రతి కుటుంబంలో సంతోషం నిండాలని ఆశిస్తున్నా. ప్రతి ఇంటా వెలుగులు నిండుతాయని ఆశిస్తున్నా. ఈ ఏడాది టీచర్‌గా ఉద్యోగం సాధించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆశిస్తున్నాను. – కె.గిరిబాబు (ఇసాక్), చౌడుపల్లి, చింతపల్లి

ప్రగతి సాధించాలి



ఈ ఏడాది ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు అందరూ ప్రగతి సాధించాలి. గత వైఫల్యాలను అధిగమించి అందరూ గెలుపు బాట సాగాలి. 2025లో యువతకు మేలు జరగాలి. విద్య, ఉద్యోగాల్లో అనుకున్న లక్ష్యాలు సాధించాలని ఆశిద్దాం.

– ఎ.సాయికిరణ్, ముంచంగిపుట్టు

దాతల సహకారం అభినందనీయం

ఎటపాక: ప్రభుత్వ ఆస్పత్రికి అవసరమైన సామగ్రిని దాతలు అందజేయటం అభినందనీయమని తహసీల్దార్ కారం సుబ్బారావు అన్నారు. గౌరిదేవిపేట పీహెచ్‌సీకి అదే గ్రామానికి చెందిన ఆకుల పుల్లారావు ఆయన కుమారులు సత్యనారాయణ, కృష్ణ రూ.50వేల విలువగల బీరువా, రిఫ్రిజిరేటర్, ప్యూరిఫైడ్ ఆర్‌వో వాటర్ మిషన్‌లు, బెడ్‌షీట్లు, దిండ్లు వితరణగా అందజేశారు.వీటిని తహసీల్దార్ సుబ్బారావు, సర్పంచ్ ఉలవల శివకనకరాజు,ఎంపీటీసి దొంతు మంగేశ్వరరావు చేతుల మీదుగా మంగళవారం పీహెచ్‌సి వైద్యులు దేవినాగ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలు అందించే ప్రభుత్వ ఆస్పత్రులకు ఇటువంటి సహాయం చేసిన దాతలను అభినందించారు. డాక్టర్ శ్రీదేవి, పీహెచ్‌సీ స్టాఫ్‌నర్స్ అప్పాయమ్మ, ఫార్మాసిస్ట్ రమాదేవి, ఎల్టీ రామలక్ష్మి, ఆయా అచ్చమ్మ గ్రామస్తులు రాము, జానకిరామయ్య, లక్ష్మణరావు తదితరులున్నారు.



గౌరిదేవిపేట పీహెచ్‌సీకి సామగ్రిని అందజేస్తున్న దాతలు

రాజు నియామకంపై హర్షం



రాజు

కొయ్యూరు: బీజేపీ మండల అధ్యక్షుడిగా మంగళవారం అరిమెల రాజును నియమించారు. పార్టీ మండల ఇన్‌చార్జి పెనుమాక రవికుమార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.శ్రీనివాసరావు రాజును మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు. రాజుకు పలువురు అభినందనలు తెలిపారు.ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఆయన నియామకంపై నేతలు హర్షం తెలిపారు.

మైదానంలో చెత్త తొలగించాలని వినతి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఉన్న హోలీ క్రీడా మైదానంలో పారిశుధ్యం లోపించి పాడైపోతుందని అధికారులు పట్టించుకోవాలని క్రీడాకారులు విన్నవిస్తున్నారు. మైదానం చుట్టూ ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నుంచి చెత్తను క్రీడా మైదానంలోకి తరుచూ పడేస్తుండడం,మురుగునీరు వచ్చేస్తూ ఉండడంతో సోమవారం స్థానిక క్రీడాకారులు తదితరులు సాయికిరణ్, శ్రీధర్, లింకన్, హరీష్, సాయి, లంబు తదితరులు ఎంపీడీవో ఎం.శ్రీసాయిహర్షను కలిసి క్రీడా మైదానంలో లోపించిన పారిశుధ్యంపై వినతిపత్రాన్ని అందజేశారు. మైదానంలో మురుగునీరు, చెత్త వలన తీవ్రమైన దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని వారు వినతిలో పేర్కొన్నారు. మైదానం పరిశుభ్రతపై దృష్టి సారించాలని కోరారు. దీనికి స్పందించిన ఎంపీడీవో శ్రీసాయిహర్ష సంబంధిత పాఠశాలల సిబ్బందితో మాట్లాడి మైదానంలోకి మురుగునీరు,చెత్త పడేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



ఎంపీడీవో శ్రీసాయిహర్షకు వినతిపత్రం అందిస్తున్న క్రీడాకారులు,యువకులు..

పిల్లలకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ

జి.మాడుగుల: ఆదివాసీ గ్రామాల్లో గల వాతావరణ పరిస్థితులపై అవగాహనతో ఆర్‌డీఎస్‌ఎస్ సంస్థ ఆదివాసీలకు నిత్యం అండగా ఉంటామని రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి గాడి శ్రీను, ఎస్టీపీసీ కంపెనీ ఉద్యోగులు శివం సింహ్‌ప్రకాశ్‌రావు సార్థా, మెటల్ కంపెనీ ఉద్యోగులు సన్యాసిరావు, శంకరరావు, వేణు తెలిపారు. జి.మాడుగుల, చింతపల్లి మండలాల పరిధిలో లోతట్టు ఆదివాసీ గ్రామాల్లో రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలబడి పిల్లలకు మంగళవారం సింహాద్రి ఎన్టీపీసీ, సార్థా మెటల్స్, అల్లాయ్స్ కంపెనీల సహకారంతో షూలు, చలికోట్లు, బ్యాగ్‌లు, పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. జి.మాడుగుల మండలంలో గడుతూరు పంచాయతీ పెద్దపార్లు గ్రామం,నుర్మతి పంచాయతీ పూతికమెట్ట గ్రామం, సొలభం పంచాయతీ చింతూరు గ్రామంలోను, చింతపల్లి మండలంలో అన్నవరం పంచాయతీ భీమునిపనుకు గ్రామాల్లో బాలబిడి పిల్లలకు వాటిని అందించినట్టు వారు తెలిపారు. బాలబడి పిల్లలకు పుస్తకాలు, దుప్పట్లు, షూస్, బ్యాగులు తదితర సామాగ్రిని అందించిన ఆదివాసీలకు అండగా ఉన్న సంస్థ ప్రతినిధి, కంపెనీ ఉద్యోగులకు ఆయా గ్రామాల గిరిజన ప్రజలు కృతజ్ఞతతు తెలియజేసారు.



పెదపార్లులో పిల్లలకు పుస్తకాలు, బ్యాగ్‌లను అందజేస్తున్న దాతలు

చురుగ్గా రహదారి పనులు



రహదారి నిర్మాణ పనుల్లో గిరిజనులు

గూడెంకొత్తవీధి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధులు రూ.9లక్షల వ్యయంతో గూడెంకొత్తవీధి మండలం పాములాయి నుంచి కుండలాయి గొంది వరకూ రహదారి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. తమ గ్రామాలకు రహదారి సదుపాయం కల్గుతుందన్న ఉద్దేశ్యంతో వీరంతా స్వచ్ఛందంగా రహదారి నిర్మాణ పనుల్లో పాల్గొంటున్నారు. గ్రామస్తులంతా కలసి పనుల్లో పాల్గొంటున్నట్టు వీఆర్పీ లక్ష్మణ్ తెలిపారు.

ఆత్మీయ వీడ్కోలు

చింతపల్లి; ప్రభుత్వ ఉద్యోగిగా ప్రతి ఒక్కరికీ పదవీ విరమణ సహజమేనని అందులో ప్రతి ఒక్కరు మన్ననలు పొందడం గర్వించదగ్గ విషయమని చింతపల్లి ఎంపిపి కోరాబు అనూషదేవి, జెట్పీటీసి పోతురాజు బాలయ్య పడాల్ అన్నారు. చింతపల్లి మండల కార్యలయంలో ఎడ్మినిస్ట్రేటివ్ అధికారి ఆకోజు రవీంద్ర పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ఏఓ రవీంద్రను శాలువాతో ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ గోపినాయక్ శారద, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, ఏఓ శ్రీనివాసరావు, పీఆర్ జేఈ బాలకిషోర్, చింతపల్లి, చౌడుపల్లి, ఎర్రబొమ్మలు, పెదబరడ ఎంపీటీసీలు జయలక్ష్మి దారలక్ష్మి, మీనాకుమారి, సెగ్గె సత్తిబాబు, లోవరాజు, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి పలు పంచాయితీలు సర్పంచులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: సమాజంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో పీజీ రామకృష్ణ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో నూగుమామిడి జీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు యాట్ల సత్యనారాయణ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో పీజీ రామకృష్ణ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ, మండల శాఖ అధ్యక్షుడు సీహెచ్.రాంబాబు, గౌరవాధ్యక్షుడు రఘుబాబుదొర, మోహనాపురం, గంగవరం ఆశ్రమ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు బాలరాజు, ఆర్.వి.వి.సత్యనారాయణ , వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొని యాట్ల సత్యనారాయణ సేవలను కొనియాడారు.



చింతపల్లిలో ఏవో రవీంద్రను సన్మానిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్, ఎంపీడీవో శ్రీనివాసరావు

ఆదివాసీలకు గృహాలు మంజూరు చేయాలి

ముంచంగిపుట్టు: అర్హులైన ఆదివాసీలకు అందరికి పీఎం జన్‌మన్ ద్వారా పీవీటీజీలకు కేటాయించినట్లే గృహాలు మంజూరు చేయాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గిరిజనులు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకొని ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ,కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన చేశారు. నాన్ పీవీటీజీలకు పీఎం జన్‌మన్ గృహాలు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ నర్సమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల నేతలు గాసిరాం దొర, నర్సింగ్‌రావుపడాల్‌లు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నివాసిస్తున్న భగత, మాలి, వాల్మీకి, కొండకుమ్మరి, కోటియ, కుమ్మర, గౌడు తదితర తెగలకు చెందిన పేద గిరిజనులకు పీవీటీజీ గిరిజనులకు కేటాయిస్తున్నట్టే గృహాలు మంజూరు చేయాలని తగు న్యాయం చేయాలని వారు అన్నారు. వీటితో పాటు గతంలో మంజూరై అర్థతరంగా నిలిచిపోయిన గృహాలకు సైతం బిల్లులు అందించాలని, గృహాలు కేటాయింపు సైతం పారదర్శకంగా జరిగే విధంగా జిల్లా అధికారులు చొరవ చూపాలని వారు కోరారు. గృహాలు మంజూరు చేయలేని పక్షాన ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడించి, ఆందోళన కార్యాయాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. గిరిజన సంఘం నేతలు బాలరాజు, సొన్ను, ప్రహ్లాద్ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు, గిరిజనులు

ప్రకృతి సేద్యంపై అవగాహన



కొండవంచుల గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీనివాసరావు

చింతపల్లి: గిరిజన రైతాంగం ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. ఎర్రబొమ్మలు పంచాయతీ పరిధిలోని కొండవంచులు, రోలంగి గ్రామాల్లో రైతులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతాంగం విధిగా భూసార పరీక్షలు జరిపించుకొని ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడినిచ్చే పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

గంగవరం: మండంలోని అడ్డపల్లి గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహదపడతాయని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో పలు సమస్యలను స్థానికులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని ఆయన పరిష్కరించారు.




వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి

హుకుంపేట: సమన్వయంతో పార్టీ నాయకులంతా కలిసి పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీపీ కూడా రాజుబాబు అన్నారు. మంగళవారం ప్రముఖ్య పుణ్యక్షేత్రం మత్స్యగుండంలో వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యంల ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తమ ఆత్మీయ సందేశాలను అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, మాజీ సమన్వయకర్త శెట్టి అప్పాలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కొండలరావు, రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు బాకురు సదాశివరాజు, అడ్డుమండ సర్పంచ్(ఎంపీ తండ్రి) గుమ్మా శ్యామ్ సుందర్, సోషల్ మీడియా కన్వీనర్ భూషణ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, నాయకులు ధర్మయ్య దొర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు

ప్రశాంత వాతావరణంలో వేడుకలు



సిఐ ఎల్.హిమగిరి

అరకులోయటౌన్: ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుక జరుపుకుందామని అరకులోయ సీఐ ఎల్.హిమగిరి అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అరకు సర్కిల్ పరిధిలోని ప్రజలకు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిఐ మాట్లాడారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు బాధ్యతయుతంగా కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుంపులుగా తిరుగుతూ అల్లర్లు సృష్టించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని సీఐ హిమగిరి కోరారు.

పాఠశాల నిర్వాహకులపై దౌర్జన్యం తగదు

పాడేరు రూరల్: జి.మాడుగుల గాంధీనగర్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినిపై ఇటీవల జరిగిన సంఘటనలో పాఠశాలకు వచ్చిన విద్యార్థిని తల్లిదండ్రులు, మరికొంతమంది వ్యక్తులు పాఠశాల యాజమాన్యం , వసతి గృహం నిర్వాహకులపై భౌతికంగా దాడి చేయడాన్ని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు పూర్ణచందర్‌రావు, కార్యదర్శి రావులు మాట్లాడుతూ ఇలాంటి ఘటనల్లో పాఠశాల నిర్వాహకులను బాధ్యులు చేస్తూ నిందించడం సరికాదన్నారు.